క్లుప్తంగా

ఖాళీ పొలాల పరిశీలన



పలాసపురంలో వరి పొలాలు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సోంపేట: మండలంలోని పలు గ్రామాల్లో వరి నాట్లు వేయని ఖాళీ పొలాలను జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ స్థానిక వ్యవసాయాధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. పలాసపురం గ్రామంలో వరినారు మడులను, నాట్లు వేయని పొలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాయితీ విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. అపరాల సాగు కోసం విత్తనాలు సరఫరా చేస్తామని చెప్పారు. ఈ–క్రాప్ నమోదు చేసుకున్న విస్తీర్ణం మేరకు రసాయన ఎరువులను సరఫరా చేస్తామన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, సర్పంచ్ తడక జోగారావు, ఎంపీటీసీ సభ్యుడు పి.వెంకటరమణ ఉన్నారు.

రాయితీపై ఎరువుల పంపిణీ



ఎరువులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడు రైతు భరోసా కేంద్రం వద్ద 370 మంది రైతులకు రాయితీపై ఎరువులను బుధవారం పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి సమక్షంలో పంపిణీ జరిగింది. రూ.1038 విలువైన ఎరువుల బస్తాను రైతుకు కేవలం 266 రూపాయల చొప్పున అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. సర్పంచ్ బుడ్డ కల్యాణ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దున్న లోకనాథం, దున్న కృష్ణమూర్తి, వ్యవసాయ సహాయకుడు సీహెచ్ భవానీ శంకర్ ఉన్నారు.

జైహింద్ సేవాసంస్థ ఔదార్యం



సాయాన్ని అందజేస్తున్న సేవాసంస్థ ప్రతినిధులు

కవిటి: పాతశిలగాం శివాలయంలో అర్చకునిగా పనిచేస్తున్న రాణో భార్య అనారోగ్యానికి గురైంది. ఈ విషయం తెలుసుకున్న జైహింద్ సేవా ఫౌండేషన్ సభ్యులు రూ.25 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి బుధవారం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. సేవాసంస్థ సభ్యులకు అర్చకుడు రాణో కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

సోంపేట: విద్యార్థులు ఇంటర్మీడియెట్ స్థాయిలోనే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు అన్నారు. కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో వైద్యులు పి.రమేష్, కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ రజనీ కుమారి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు జలంత్రకోట విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కంచిలి: జలంత్రకోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఇచ్ఛాపురంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చడం ద్వారా జిల్లాస్థాయి పోటీలకు జ్యోత్స్నరాణి బెహరా, స్నేహ రాణో, స్నేహలత పాఢిలు ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు భాస్కర మిశ్రా, పీఈటీ సంతోష్ గౌడో, మిగతా ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

నేడు 15వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 15వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. మంత్రి సీదిరి అప్పలరాజు, మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు పాల్గొంటారన్నారు.

బాబు పాలన అవినీతిమయం

- ఎమ్మెల్సీ రామారావు, నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్
- ఉత్సాహంగా కొత్త పింఛన్ల పంపిణీ



కంచిలి: లబ్ధిదారులకు కొత్తపింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు, సమన్వయకర్త సాయిరాజ్

కంచిలి: చంద్రబాబు పాలనంతా అవినీతిమయమని, ప్రజాధనం లూటీ చేసిన ఘనుడని ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆరోపించారు. మండల కేంద్రం కంచిలిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి కొత్తగా మంజూరైన 364 పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ.. చంద్రబాబు చేసిన అవినీతిని రోజుకొకటి వెలికితీసి కోర్టులో ప్రవేశపెడుతుంటే వాటిని ప్రశ్నించని దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ అతన్ని ఎందుకు అరెస్టు చేశారంటూ రోడ్లపై పడుకుని నిరసన వ్యక్తం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమన్వయకర్త సాయిరాజ్ మాట్లాడుతూ..చంద్రబాబు పాపం పండిందన్నారు. అతని అవినీతి చిట్టా రోజుకొకటి బయటకు వస్తుందని చెప్పారు. ఇంకా అతని జీవితమంతా జైలుల్లోనే గడపాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రతినెల వలంటీర్లతో పింఛన్ల పంపిణీ సక్రమంగా జరుగుతోందన్నారు. అదేవిధంగా నవరత్నాల పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. కేవలం జగనన్న పరిపాలనలోనే సంపూర్ణంగా అన్ని పథకాలు అందుతున్నాయని, అటువంటి పాలన మళ్లీ కావాలంటే సీఎం జగన్‌ను ఆశీర్వదించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, నాయకులు గుమ్మిడి రామదాసు, యారడి ఆనందరావు, కొల్లి ఈశ్వరరావు, లడ్డుకేశవపాత్రో, దుర్గాసి ధర్మారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

సంతబొమ్మాళి: రాజకీయాలకు అతీతంగా.. అర్హులందరికీ పింఛన్లు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని జడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి అన్నారు. నౌపడ, వడ్డితాండ్ర, ఆర్.హెచ్.పురం తదితర పంచాయతీల్లో పలువురికి మంజూరైన కొత్త పింఛన్లను అందజేశారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో కూడా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బృందాదేవి, ఎన్ని మన్మథరావు, పీఏసీఎస్ డైరెక్టర్ పి.రవికుమార్‌రెడ్డి, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు

పేదల ప్రభుత్వం

సోంపేట: రాష్ట్రంలో పేదల ప్రభుత్వం ఎంపీపీ నిమ్మన దాస్ అన్నారు. పాలవలస, కొర్లాం పంచాయతీల్లో కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు వైఎస్సార్ పింఛన్ కానుక అందజేత

ఇచ్ఛాపురం రూరల్: కులం, మతం, రాజకీయాలు చూడమని.. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటలు నిజం చేస్తున్నారని టీడీపీ నాయకులు సైతం మెచ్చుకుంటున్నారు. తేలుకుంచి గ్రామంలో టీడీపీకి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కొణతాల మేనక భర్త కనకరాజు, టీడీపీ వార్డు సభ్యుడు దక్కత పురుషోత్తమరెడ్డిలకు నూతనంగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుకను గ్రామ సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి చేతులు మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

రత్తకన్నలో..

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ 18వ వార్డు రత్తకన్న గ్రామానికి చెందిన పలువురికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. సచివాలయం ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రచారవిభాగ జిల్లా కమిటీ అధ్యక్షుడు తాడి ఆదిరెడ్డి, 18 వార్డు కౌన్సిలర్ చిడిపోతు జగన్నాయకులు లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద లెంక జయరామ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

పలాస మున్సిపాలిటీలో 415 మందికి..

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 31వార్డుల్లో 415 మందికి మంజూరైన కొత్త పింఛన్లను అధికారులు, ప్రజాప్రతినిధులు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు శిష్టు గోపి, కర్రి మాధవరావు, సవర సోమేష్, బడగల బల్లయ్య, అంబటి ఆనందరావు, బమ్మిడి సంతోష్, డొక్కరి దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో 15 మందికి..

కోటబొమ్మాళి: స్థానిక మేజర్ పంచాయతీలోని నాలుగో వార్డులో సర్పంచ్ కాళ్ల సంజీవరావు 15 మందికి సామాజిక పింఛన్లను అందజేశారు. వార్డు సభ్యులు డబ్బీరు ప్రదీప్, యర్రి చిరంజీవి పాల్గొన్నారు.

బొడ్డపాడులో 21 మందికి..

పలాస: బొడ్డపాడు గ్రామం సచివాలయంలో 21 మందికి కొత్త పింఛన్లను సర్పంచ్ తామాడ మదన్, ఎంపీటీసీ సభ్యుడు మద్దిల పాపారావు అందజేశారు. వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుడు బుడత ధనరాజు, బూత్ కన్వీనరు మల్లారపు దుష్యంతు, సచివాలయం కన్వీనరు సైని లలిత, పంచాయతీ కార్యదర్శి మీనాకుమారి పాల్గొన్నారు.

దోకులపాడులో..

వజ్రపుకొత్తూరు రూరల్: దోకులపాడులో కొత్త పింఛన్ల పంపిణీని సచివాలయ కోఆర్డినేటర్ వడ్డి కరుణాకర్ చేపట్టారు. సర్పంచ్ వడ్డి సరిత, ఎంపీటీసీ సభ్యురాలు కొయిరి భాగ్యలక్ష్మి, పార్టీ నాయకులు కొరియి ఢిల్లీరావు, పుక్కళ్ల రామచంద్రుడు, యంపల్ల పాపారావు, వెంకటరావు ఉన్నారు.



సోంపేట: పాలవలసలో పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్



కాశీబుగ్గ: సాయిబుల కాలనీలో పింఛన్లు అందజేస్తున్న నాయకులు గోపి, బల్లయ్య, ఆనంద్, సంతోష్



కోటబొమ్మాళి: పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ సంజీవరావు



ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచిలో పింఛన్ అందుకుంటున్న టీడీపీ నాయకులు



సంతబొమ్మాళి: నౌపడలో పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ బృందాదేవి తదితరులు



ఇచ్ఛాపురం:పింఛన్లను అందజేస్తున్న నాయకులు



పలాస పింఛన్లు అందుకున్నవారితో నాయకులు



వజ్రపుకొత్తూరు రూరల్: దోకులపాడులో పింఛన్లు అందజేస్తున్న నాయకులు

అధ్యాపకుల సమిష్టి కృషితోనే నాక్‌గ్రేడ్ సాధ్యం



అధ్యాపక సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌జేడీ శోభారాణి

ఇచ్ఛాపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపక బృందం సమిష్టి కృషితోనే నాక్‌గ్రేడ్‌ని సాధించగలమని కళాశాలల విద్యా జోన్–1 ఆర్‌జేడీ ఎస్.శోభారాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలకు అవసరమైన వసతులపై ఆరా తీశారు. కళాశాలకు మంజూరైన రూసా నిధుల గురించి ఇంజినీరింగ్ సిబ్బందితో మాట్లాడి వెంటనే డీపీఆర్ సిద్ధం చేయాలని సూచించారు. సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి ఆర్జేడీని కలిసి పలు విషయాలపై చర్చించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ఆక్రమణకు గురైన కళాశాల స్థలాన్ని రీసర్వే చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి ఉజ్వల భవిష్యత్ కోసం ప్రతిఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సీడాప్ చైర్మన్ సూచించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డి.అరుణపద్మ, అకాడమిక్ గైడెన్స్ అధికారి కె.సుధ, కళాశాల ప్రిన్సిపాల్ రబీన్ కుమార్ పాఢీ, బారువ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ ఉన్నారు.

ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలి



మాట్లాడుతున్న తిరుమలరావు

టెక్కలి: ఈ ఖరీఫ్ సీజన్‌లో టెక్కలి నియోజకవర్గంలో 73,800 ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేస్తున్నారని.. వీరంతా పూర్తి స్థాయిలో ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయశాఖ టెక్కలి ఏడీ బి.వి.తిరుమలరావు సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 70 శాతం వరకు ఈ–పంట నమోదు ప్రక్రియ జరిగిందన్నారు. అలాగే మిగిలిన 30 శాతం నమోదును ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తామన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను 50 శాతం వరకు రైతు భరోసా కేంద్రాలకు తరలించామన్నారు. డీఏపీ, యూరియా కలిపి సుమారు 4,200 టన్నుల వరకు సరఫరా చేసినట్లు ఏడీ తిరుమలరావు వెల్లడించారు. ముఖ్యంగా రైతులంతా అత్యధికంగా యూరియా వినియోగిస్తున్నట్లు తెలిసిందని దీని వలన పంటలు దోమ పోటుతో పాటు ఇతర చీడ పీడలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డీఏపీతో పాటు యూరియాను వినియోగించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సంబంధించి రైతులకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసుకునేందుకు సమీపంలోని ఆర్‌బీకేల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు

- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీరాజ్



కాశీబుగ్గ: సిబ్బంది వివరాలను కంప్యూటర్‌లో పరిశీలిస్తున్న సీఎండీ పృథ్వీరాజ్



కవిటి: బొరివంకలో తనిఖీ చేస్తున్న సీఎండీ పృథ్వీతేజ్

కాశీబుగ్గ: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేయాలనే లక్ష్యంతోనే ముందుకు వెళ్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఐ.పృథ్వీరాజ్ అన్నారు. పలాసలోని ఈఆర్‌వో కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. అనంతరం పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ మూడో వార్డులోని పద్మనాభపురం వార్డు సచివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్దానం ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో పర్యటించేందుకు వచ్చినట్టు చెప్పారు. ఈ ప్రాంతంలో చెట్టు కొమ్మల మధ్య నుంచి విద్యుత్ లైన్లు ఉండడంతో సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నట్టు గుర్తించామన్నారు. కవర్ కండక్టర్ల ద్వారా ఇబ్బంది లేకుండా చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. నూతనంగా సబ్‌స్టేషన్లతో పాటుగా ఇంటర్ కనెక్టింగ్ లైన్లు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగరా 302 కిలోమీటర్ల 11 కేవీ లైను, కవిటి మండలంలో 33 కేవీ లైను 28 కిలోమీటర్ల మేర వేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు. విద్యుత్ ఉద్యోగులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఈ ఎల్.దైవప్రసాద్, ఈఈ జి.ప్రసాద్, ఎస్ఏవో పి.తాతాచార్యులు, డీఈఈ ఐ.కృష్ణమూర్తి, ఏఈలు వివేకానంద, నాగభూషణ్, యోగి, లైన్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ తనిఖీ

కవిటి: బొరివంక ఉపవిద్యుత్ కేంద్రం కోసం ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేస్తున్న 11 కేవీ విద్యుత్‌లైన్ పనులను సీఎండీ పృథ్వీతేజ్ బుధవారం పరిశీలించారు. ప్రత్యామ్నాయ లైన్ ఏర్పాట్లపై సిబ్బందితో చర్చించారు. కవిటిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సబ్‌స్టేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఇటీవల విశాఖలో సీఎండీని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త సాయిరాజ్ కలిసి కోరారు. ఈ నేపథ్యంలో ఇక్కడకు వచ్చిన ఆయన కవిటి సబ్‌స్టేషన్ ఏర్పాటు పనుల స్థితిగతులపై జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ దైవప్రసాద్, డీఈఈ ప్రసాదరావులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చెట్లు అధికంగా ఉన్నపరిస్థితుల్లో తరచూ బ్రేక్‌డౌన్లు అవడం జరుగుతోందని బొరివంక సర్పంచ్ శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు సతీష్ సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన మాట్లాడుతూ.. కన్సిల్డ్ కండక్టర్లను అత్యవసరమైన స్థానాల్లో ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని ట్రాన్స్‌కో ఏఈ నేతాజీని ఆదేశించారు.

మంత్రిని కలిసిన గొర్రెల పెంపకం సంఘ నాయకులు



మంత్రి అప్పలరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చిన్నారావు యాదవ్

కాశీబుగ్గ: జిల్లా గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం అధ్యక్షుడుగా రాపాక చిన్నారావు యాదవ్ ఎంపికయ్యారు. దీంతో మంత్రి సీదిరి అప్పలరాజును తన క్యాంపు కార్యాలయంలో చిన్నారావు యాదవ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఉంగ సాయిక్రిష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ జినగ సీతారాం, ఎంపీటీసీ సభ్యుడు కోరాడ ధనరాజు, మాకనపల్లి సర్పంచ్ సైని దేశయ్యా, లొద్దభద్ర సర్పంచ్ రాపాక శేషగిరి, జిల్లా యాదవ సంఘం కార్యదర్శి ఐతి ఈశ్వరరావు, యువజన డొక్కరి దిలీప్‌కుమార్, దాసరి దానేష్, పానిల కృష్ణారావు, సార ఢిల్లీశ్వరరావు, రాపాక ఢిల్లీరావు, జినగ సీతయ్య, తెప్పల శ్యాము, రాపాక వెంకటరావు, దువ్వయ్య, రాపాక సాగర్, రంది రాజారావు, యండమూరి బోగేష్, కె.తేజ, డొక్కరి వాసు, జినగ శ్యామ్, సింహాద్రి, నీలకంఠం, పాపారావు ఉన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

ఇచ్ఛాపురం రూరల్: బిర్లంగి ఉన్నత పాఠశాల, ఎ.బరాంపురం ప్రాథమికోన్నత పాఠశాలల్లో గతంలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం ఆయా పాఠశాలల్లో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు అందించిన సేవలను ప్రధానోపాధ్యాయులు పి.వెంకటరమణ, సూర్యప్రభాకరరావు కొనియాడారు.

అభివృద్ధిని చూసి అండగా నిలవండి

- వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి
- కాపుతెంబూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



వర్షంలోనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దువ్వాడ వాణి

నందిగాం: గత ప్రభుత్వాలకు, ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకున్న తరువాతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను చేరువ చేయడంతోనే ధైర్యంగా ప్రజల ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. కాపుతెంబూరు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని చిరుజల్లుల నడుమ బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక చేకూరిన లబ్ధిని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏవైనా పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల చేతులు తడపవలసి ఉండేదన్నారు. ప్రస్తుతం ఒక్క పైసా లంచం లేకుండా సంక్షేమ పథకాన్నీ ఇంటి వద్దకే వలంటీర్లు తీసుకువచ్చి అందజేస్తున్నారన్నారు. అప్పటికి.. ఇప్పటికీ తేడా గుర్తించి ప్రతిఒక్కరికీ మేలు చేస్తున్న జగనన్నకు అండగా నిలవాలని కోరారు. అలాగే పచ్చ పత్రికలు ప్రతి రోజు ప్రభుత్వంపై లేనిపోని రాతలు రాస్తున్నాయని వాటిలో నిజానిజాలు తెలుసుకోవాలని సూచించారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాపుతెంబూరులో జరిగిన అభివృద్ధిని, జగన్ ముఖ్యమంత్రి అయ్యాక గ్రామంలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పోలాకి మోహనరావు, దువ్వాడ హైందవి, కింతల ధర్మారావు, యర్ర చక్రవర్తి, జేసీఎస్ ఇన్‌చార్జి జడ్యాడ జయరాం, కణితి నారాయణమూర్తి, బాలక మధు, అట్టాడ శ్రీనివాసరావు, పూడి ఆశారాణి, కోనారి రామారావు, మాదిన గోపాలక్రిష్ణ, సైలాడ లావన్న, బార్నాన బాబూరావు, పోలాకి చిరంజీవులు, కారగ్గి బాబూరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గడప గడపలో సంతోషం

- ఇచ్ఛాపురం సమన్వయకర్త సాయిరాజ్
- పాతకొజ్జీరియాలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమాన్ని వివరిస్తున్న సాయిరాజ్

కవిటి: ముఖ్యమంత్రి వై జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనలో గడప గడపలో సంతోషం నెలకొందని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. కొజ్జీరియా పంచాయతీ పాతకొజ్జీరియాలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి గడచిన నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు వివిధ పథకాల ద్వారా ఏమేరకు లబ్ధి చేకూరిందన్న విషయాన్ని వివరించారు. ఇంకా సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నూతలపాటి బాబూరావు, మండల యూత్ కన్వీనర్ ఎన్ని అశోక్, దక్కత నూకయ్య, పిట్ట దేవేంద్రరెడ్డి, పద్మనాభం పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

గ్రంథాలయానికి కుర్చీల వితరణ

పలాస: నీలావతి గ్రామంలో యు.వి.వి ఆధ్వర్యంలో నిర్మించిన గ్రంథాలయం విద్యానిలయంగా వర్ధిల్లాలని అండమాన్ సహోదర యువజన సంఘం అధ్యక్షుడు కుత్తుం నీలకంఠం ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రంథాలయానికి 20 కుర్చీలను వితరణగా బుధవారం అందజేశారు. యూవీవీ అధ్యక్షుడు ఇసాకోటి జోగారావు, కార్యదర్శి బొడ్డు చిన్నారావు, కుత్తుం ప్రకాశరావు, జినగ సీతారాం, కుత్తుం సుధాకర్, తంగుడు ఖగేష్ ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కంచిలి: కేసరపడ గ్రామ ప్రధాన వీధిలో మండల పరిషత్ నిధులు రూ. 5 లక్షలతో చేపట్టనున్న సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు జి.రామదాసు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, జేసీఎస్ మండల కన్వీనర్ కె.సురేష్, కప్పల యుగంధర్, మెండ ప్రకాశరావు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

సోంపేట: సోంపేట మేజర్ పంచాయతీలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీపీ నిమ్మన దాస్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ సత్యన్నారాయణ, ఎంపీడీవో బి.వెంకటరమణ, హౌసింగ్ ఏఈ శివరామకృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ అబ్బాస్, ఈవో వరప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత

కోటబొమ్మాళి: చీపుర్లపాడు పంచాయతీ దుర్గంపేటకు చెందిన సిల్లా దుర్గారావు ఇటీవల మరణించారు. అతని భార్య కామమ్మకు లక్ష రూపాయల వైఎస్సార్ బీమా మంజూరైంది. దీనికి సంబంధించిన చెక్కును సర్పంచ్ నేతింటి అప్పలస్వామి బుధవారం అందజేశారు. వార్డు సభ్యుడు కాకి లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ రాకేష్ ఉన్నారు.

ఖరీఫ్‌లో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

మందస: ఖరీఫ్ సీజన్‌లో వరి పంటలకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ చెప్పారు. జిల్లుండ రైతు భరోసా కేంద్రం పరిధిలోని వరి పంట పొలాలను బుధవారం పరిశీలించారు. వర్షాలు ఆలస్యంగా కురడంతో పాటు దమ్ములు అనంతరం వర్షాలు సరిగా లేకపోవడంతో కొన్ని చోట్ల వరినాట్లు ఎండిపోవడం కూడా జరిగిందన్నారు. ఈ తరుణంలో రైతులు ఎరువులు వేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వరి పంటలకు ఆశించు తెగుళ్లపై జాగ్రత్తలు వివరించారు. ఈ క్రాప్(పంట నమోదు) సూపర్ చెక్ చేశారు. ఏడీఏ అగ్రోనమీ భవానీశంకర్, పలాస ఏడీఏ ఎల్.వి.మధు, మందస వ్యవసాయాధికారి జి.నాగరాజు, పలాస ఉద్యానవనశాఖాధికారి చిడిపల్లి శంకర్‌దాస్, వీపీఏ దువ్వు చరణ్, జిల్లుండ సర్పంచ్ చింతాడ శ్రీకావ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శిస్టు బాపూజీ ఉన్నారు.

పోస్టల్ ఉద్యోగి మృతికి సంతాపం

మందస: మందస పట్టణానికి చెందిన పోస్టల్ ఉద్యోగి కొయిల వెంకటరావు(59) బుధవారం ఆకస్మికంగా మరణించారు. మందస బ్రాంచ్ పోస్టాఫీసులో సుమారు 35 సంవత్సరాల పాటు ఈడీగా పని చేసిన వెంకటరావు ఇటీవల సోంపేటకు ఎంటీఎస్‌గా బదిలీపై వెళ్లారు. సోంపేట పోస్టుమాస్టర్ కె.సంతోష్‌తో పాటు సిబ్బంది వెంకటరావు అంత్యక్రియలకు రూ.10 వేలు అందజేశారు. ఈయన మృతిపై పలువురు సంతాపం తెలియజేశారు.

కొండతెంబూరులో వైద్య శిబిరం

నందిగాం: దేవుపురం పంచాయతీ కొండతెంబూరులో నౌగాం పీహెచ్‌సీ వైద్యాధికారి పినకాన అంజనీ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శిబిరంలో 38 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హెచ్ఎస్ సూర్యనారాయణ, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

పలాస: బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం డాక్టరు వైఎస్సార్ కంటి వెలుగు నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు నిర్వహించారు. 261 మందికి వైద్య పరీక్షలు చేశారు.